క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక

చారకొండ: మండలంలోని జేపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జూపల్లి వెంకటయ్య యాదవ్ తదితరులు ఆదివారం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కసిరెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. కాంగ్రెస్ గెలుపునకు కృషి చేస్తామని అన్నారు. ముజ్జుబాయి, గోవర్ధన్, భగవాన్ తదితరులు ఉన్నారు.

అచ్చంపేటకు ఓటరు చైతన్య బస్సు యాత్ర



అచ్చంపేట రూరల్: ఓటరు చైతన్య బస్సుయాత్ర ఆదివారం రాత్రి అచ్చంపేటకు చేరుకుంది. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పలువురు వివరించారు. యాత్రకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీకృష్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్, ప్రముఖులు ఆకునూరు మురళి, వినాయక్ రెడ్డి, లక్ష్మీనారాయణ, నైనాల గోవర్ధన్, శంకర్, రామకృష్ణ, కృష్ణారావు, సారయ్య, లింగయ్య నాయక్, కల్పన, రాములు, సంధ్యా, సౌజన్య, మహమ్మద్ గౌస్, బాలు, కళాకారులు పాల్గొన్నారు.

- తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతోనే అభివృద్ధి సాధ్యమని అందుకోసం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ వంశీకృష్ణకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఆదివారం మన్ననూర్‌లోని వివిధ కాలనీల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రహీం, శ్రీనివాసులు, వెంకటరమణ, సైదులు, శివాజీ, రమణ, పాండు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీకి నివాళి

వెల్దండ: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆమె దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, వెంకటయ్యగౌడ్, పుల్లయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా ప్రచారం

కల్వకుర్తి రూరల్: ఒక్కసారి అవకాశం ఇస్తే తానేంటో చూపిస్తానని, ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానని కల్వకుర్తి బీజేపీ అభ్యర్థి ఆచారీ ప్రజలను కోరారు. ఆదివారం కల్వకుర్తి మండలంలోని జంగారెడ్డిపల్లి, ఎల్లికల్, ఎల్లికల్ తండాలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. 5 సార్లు ఓడిపోయినా ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ఆరో సారి పోటీ చేస్తున్నానని, ఒక్కసారి ఈ పేదింటి బిడ్డను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాంచంద్రారెడ్డి, కృష్ణగౌడ్, సురేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- కొండూరులో శనివారం రాత్రి 9 గంటల సమయంలో కొండూరులో కాంగ్రెస్ నేత జూపల్లి కృష్ణారావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డబ్బుల కోసం ఆశపడి మరో పార్టీ మారిని ఘనత ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిదని అన్నారు. ఆయన ఏ మొహం పెట్టుకుని వచ్చి ఓట్లు అడుగుతారని ఎమ్మెల్యేపై మండిపడ్డారు. చింతలపల్లి జగదీశ్వర్‌రావు, దా పగిడాల శ్రీనివాసులు, కేతూరి వెంకటేష్, నర్సింహయాదవ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.
- అంజన్న లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌తో ఈ ప్రాంతానికి సాగునీరు అందించి తీరుతానని అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. ఆదివారం పదర మండలంలోని మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మద్దిమడుగు, మారడగు, ఇప్పలపల్లి, ఉడిమిళ్ల చిట్లంకుంట తదితర గ్రామాల్లో మాట్లాడారు.
- బీఆర్ఎస్ అభ్యర్థి గువ్వల బాలరాజును అధిక మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ కోరారు. ఆదివారం పట్టణంలోని 10వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. భగవంత్‌గౌడ్, మంజూర్‌అహ్మద్, జైపాల్, రవి, రాజశేఖర్, సుధాకర్, మల్లేష్ పాల్గొన్నారు.
- బీఎస్పీతోనే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి జరుగుతుందని బీఎస్పీ నాయకులు పృథ్వారాజ్, కొట్ర బాలు అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు సిర్సవాడ, ఇంద్రకల్ గ్రామాల్లో బీఎస్పీ తరపున నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న కొత్తపల్లి కుమార్‌ను గెలిపించాలంటూ వినూత్న రీతిలో ప్రచారాలు సాగించారు. ఉపాధిహామీ కూలీలతో మాట్లాడి వారి సాదక బాధకాలను తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు ఉపాధి కలగడంతో పాటు కూలీలకు పని కల్పించడం జరుగుతుందన్నారు. బీఎస్పీ తమ అభ్యర్థి కుమార్‌ను గెలిపించాలంటూ ఉపాధి పనుల వద్ద కూలీలకు అవగాహన కల్పించారు.
- వసంతాపూర్‌లో బీఎస్పీ ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. అంతటి నాగన్న, రాంచందర్, శివకృష్ణ, భాస్కర్, తదితరులు ప్రచారం చేశారు.

నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ కో-ఆర్డినేటర్‌గా మణెమ్మ

కందనూలు: నాగర్‌కర్నూల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కొండ మణెమ్మను నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం నియామక పత్రాన్ని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి కొండ మణెమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

ఇంటికే పోల్‌చీటీలు

- బీఎల్‌ఓల ద్వారా నేరుగా ఓటర్లకు పంపిణీ చేస్తున్న ఎన్నికల సంఘం
- ప్రజలను చైతన్యపర్చేలా మార్గదర్శకాలతో కూడిన ఓటర్ గైడ్
- భయం లేకుండా.. సరైన అభ్యర్థికి ఓటు వేయాలని పోల్‌చీటీ వెనుకలా ముద్రణ
- జిల్లాలో 9,50,838 మందికి పంపిణీ చేసేందుకు ప్రక్రియ ప్రారంభం



అచ్చంపేట మండలం చెదురబావి తండాలో ఓటరు స్లిప్‌లు అందజేస్తున్న బీఎల్‌ఓలు

అచ్చంపేట: శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఓటర్లకు పోలింగ్ స్లిప్‌లను పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఈసీ ఆదేశాల మేరకు బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు నేరుగా పోల్ చీటీలు అందజేస్తున్నారు. శనివారం నుంచి పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 22వ తేదీలోగా పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేసిన యంత్రాంగం ఈ దిశగా ముందుకు సాగుతున్నారు.

సులువుగా ఓటేసేలా..

ఎన్నికల్లో ఓటేసేందుకు పోల్ చీటీలు దోహదపడుతాయి. వీటిని గతంలో రాజకీయ పార్టీలే ముంద్రించి ఎన్నికలకు ముందు రోజున ప్రచారం చేసుకుంటూ ఓటర్లకు అందించేవారు. అయితే ఓటర్లందరికీ అవి అందేవి కావు. దీంతో తమ పోలింగ్ కేంద్రం ఎక్కడుందో తెలియక ఓటర్లు పోలింగ్ రోజున ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ముఖ్యంగా నిరక్షరాస్యులు, వృద్ధులు తిప్పలు పడాల్సి వచ్చేది. ఓటర్లు సులువుగా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కు వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘమే పోల్ చీటీలను అందజేస్తోంది.

పంపిణీ ప్రారంభం..

జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1,055 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. వాటి పరిధిలో 9,50,838 మంది ఓటర్లు ఉన్నారు. వారందరికీ తమ పేరు, తండ్రి/భర్త పేరు, పోలింగ్ కేంద్రం పేరు, పోలింగ్ కేంద్రం సంఖ్య, చిరునామా, ఓటరు జాబితాలోని పేరు సంఖ్య వంటి వివరాలతో కూడిన పోల్ చీటీలను అందజేయనున్నారు. ఎన్నికలకు ఇంకా 11 రోజుల గడువు ఉన్నప్పటికీ పోలింగ్ కేంద్రాల సమాచారం ముందుగానే తెలుసుకునేలా ఓటర్లకు వీటిని అందజేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్‌ఓలకు ఓటర్ల సంఖ్య అనుగుణంగా అవసరమైన పోల్ చీటీలను రెవెన్యూ అధికారులు అందజేశారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి 2,32,780, అచ్చంపేటకు 2,42,129, కొల్లాపూర్‌కు 2,34,167, కల్వకుర్తికి 2,41,762 ఓటరు స్లిప్పులు ఉన్నాయి. ఈ మేరకు బీఎల్‌ఓలు తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి అందజేస్తున్నారు.

పలు సంస్కరణలకు శ్రీకారం...

ఎన్నికల సంఘం ఓటర్లను చైతన్య పర్చేందుకు పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. గతంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సమయంలో ఓటర్లకు పోల్ చిట్టీలు మాత్రమే పంపిణీ చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో ఓటర్లకు పోల్ చిట్టీలతో పాటు పలు సూచనలతో కూడిన మూడు పేజీల ఓటరు గైడ్‌ను పంపిణీ చేస్తున్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ద్వారా జారీ అయిన ఈగైడ్‌లు ఇప్పటికే తహసీల్దార్ కార్యాలయాలకు చేరాయి. ఓటరు జాబితాలో పేరు నమోదు, తనిఖీ చేసుకునేందుకు అవసరమైన వెబ్‌సైట్ చిరునామా, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ, ఓటరు సహాయ కేంద్రం, మొబైల్ యాప్, తపాలా బ్యాలెట్ విధానం గురించి ఇందులో వివరించారు. ఓటు వేయడానికి వెళ్లే ముందు పాటించాల్సిన సూచనలు, పోలింగ్ కేంద్రంలో ఐదు దశల్లో పోలింగ్ ప్రక్రియ, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో ఓటు వేసే విధానం, ఎన్నికల సమయంలో ఎవరైనా అభ్యర్థులు మద్యం, డబ్బులు పంపిణీ చేస్తే సి విజిల్ యాప్, 1950 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం అందించాలని అవగాహన కల్పిస్తున్నారు.

కేంద్రాలు గుర్తించేందుకు గూగుల్ మ్యాప్..

పోలింగ్ రోజు ఓటర్లు ఇబ్బందులు పడకుండా నేరుగా పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా పోల్ చిట్టీ వెనుక భాగంలో గూగుల్ మ్యాప్ ముంద్రించారు. ఇందులో నియోజకవర్గం, పోలింగ్ కేంద్రం పేరు, బీఎల్‌ఓ ఫోన్ నంబరు మంద్రించారు. సరైన అభ్యర్థికి ఓటు వేయండి.. భయం లేకుండా ఓటు వేయండి అంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం రూపొందించిన కరపత్రాలు అందజేస్తున్నారు.

ఓటర్లు ఇళ్లలో లేకుంటే..

సిబ్బంది ఇళ్లకు వెళ్లిన సమయంలో లేనివారి పోల్ స్లిప్‌లు పోలింగ్ రోజున సంబంధిత పోలింగ్ కేంద్రం వద్ద అందుబాటులో ఉంచుతారు. వారితో పాటు చిరునామాలో లేనివారివి, డూప్లికేట్లుగా భావించినవారివి అందుబాటులో ఉంచుతారు. అక్కడ తగిన ఆధారం చూపి పోల్‌చీటీ పొందవచ్చు. పోల్‌చీటీ లేకపోయినా ఎన్నికల సంఘం పేర్కొన్న 12 రకాల గుర్తింపు కార్డులో ఏదైనా ఒకదాని చూపించి ఓటరు జాబితాలో పేరుంటే ఓటరు వేయవచ్చు.

శాస్త్రోక్తంగా సామూహిక సత్యసాయి షష్టిపూర్తి



షష్టిపూర్తి వివాహ కార్యక్రమంలో పాల్గొన్న జంటలు

కందనూలు: భగవాన్ శ్రీసత్యసాయిబాబా 98వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని సత్యసాయిబాబా మందిర్‌లో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళా సేవాదళ్ వారిచే ఘనంగా సామూహిక షష్టిపూర్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర్ హకీం విశ్వప్రసాద్, సాయిబాబా ఆలయ ప్రధాన అర్చకులు వావిలాల రాజశేఖర్ శర్మ మాట్లాడారు. వైదిక సాంప్రదాయంగా యజ్ఞో హోమ నిర్వహణ తదుపరి వేదమంత్రోచ్ఛరణల మధ్య సామూహిక షష్టిపూర్తి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. శ్రీసాయి ప్రశాంతి చారిటబుల్ సేవా ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ఎలిమే ఈశ్వరయ్య మాట్లాడారు. మానవ జీవితంలో పెళ్లిని సాధారణంగా జరుపుకోవాలని, షష్టిపూర్తిని ఘనంగా ఆత్మీయులతో జరుపుకోవాలని అన్నారు. 60 సంవత్సరాలు జీవితంలో నిండిన తర్వాత షష్టిపూర్తి జరుపుకోవడం 60, 70, 75, 80 సంవత్సరాల్లో కూడా ఆరోగ్యంగా ఉండేందుకు ప్రత్యేకంగా వేదమంత్రోచ్ఛరణలతో సామూహికంగా హోమం నిర్వహించారు. సత్యసాయి మహిళా సేవాదళ్ వారిచే 23 మంది దంపతులకు నూతన పట్టు వస్త్రాలు, పసుపు, కుంకుమ, గంధం, గాజులు అందించారు. అనంతరం దంపతులకు ప్రత్యేకంగా పూలమాలలు అందజేసి షష్టిపూర్తి వివాహ కార్యక్రమాన్ని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 23 మంది దంపతులకు నిర్వహించారు. షష్టిపూర్తి అనంతరం సామూహిక భోజనాలు నిర్వహించారు. మహిళా సేవాదళ్ కన్వీనర్ మిడిదొడ్డి సువర్ణ, సాయి గీత, పద్మ, సుప్రజ, బాలమణి, కవిత శిల్ప, వీణ, జ్యోతి, సుమలత, సత్యసాయి ట్రస్ట్ సభ్యులు బాలకృష్ణ, గిరి, మన్నెపు రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఖచ్చితంగా గెలుస్తాం..

- కర్ణాటక విద్యాశాఖ మంత్రి సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న కర్ణాటక ఉన్నత విద్యాశాఖ మంత్రి సుధాకర్

కందనూలు: తెలంగాణలో ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, ఖచ్చితంగా గెలుస్తామని కర్ణాటక విద్యాశాఖ మంత్రి సుధాకర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పథకాలు అమలు చేస్తలేదని, అధికార బీఆర్ఎస్ తప్పుడు ప్రకటనలు చేస్తుందని అన్నారు. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన తొలిక్యాబినెట్‌లో ఐదు గ్యారంటీలకు గాను నాలుగు అమలు చేశామని చెప్పారు. కేసీఆర్ అబద్ధాలతో మరోసారి రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తున్నాడని అన్నారు. రాష్ట్రం ఇస్తే టీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తానని మొదటి సారి మాట తప్పిన కేసీఆర్, దళిత సీఎం, డబుల్‌బెడ్రూం, దళిత బంధు ఇలా అనేక హామీలు ఇచ్చి అమలు చేయలేదన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు బంపర్ మెజార్టీతో గెలుస్తారన్నారు. ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 21న బిజినేపల్లిలో రేవంత్‌రెడ్డితో పబ్లిక్ మీటింగ్ ఉంటుందని, ప్రజలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

మార్పు కోరుకుంటున్నారు..

అచ్చంపేట: తెలంగాణలో బీఆర్ఎస్ పాలనపై విసుగు చెందిన ప్రజలు మార్పు కోరుకుంటున్నారని కర్ణాటక ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంఎస్ సుధాకర్ అన్నారు. ఆదివారం అచ్చంపేటలో ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో మాట్లాడారు. ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలు విశ్వసిస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ, జి.రాజేందర్, మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

అచ్చంపేటలో ఈ నెల 21న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల శంఖారావం బహిరంగ సభ ఉంటుందని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ తెలియజేశారు.

రాజేశ్‌రెడ్డిని గెలిపించాలి

తాడూరు: నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఎమ్మెల్యేగా బరిలో ఉన్న కూచుకుళ్ల రాజేష్‌రెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి డాక్టర్ సరిత ఆదివారం మండలంలోని పాపగల్‌లో ప్రచారం నిర్వహించారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు రాందేవ్‌రెడ్డి, లింగం, చంద్రమౌళి పాల్గొన్నారు.

తెలకపల్లి: కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్‌రెడ్డిని గెలిపించాలని ఆదివారం మండల కేంద్రంతో పాటు గౌరారం తదితర గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు.

సీఎం సభకు తరలిన నాయకులు

తెలకపల్లి: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల ప్రజలు సీఎం కేసీఆర్ సభకు తరలివెళ్లారు. ఆదివారం ఉయ్యలవాడ సమీపంలో జరిగిన ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డిని గెలిపించాలని ప్రజా ఆశీర్వాద సభకు వివిధ గ్రామాల నుంచి తరలివెళ్లారు.

చారకొండ: కల్వకుర్తిలో ఆదివారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు జూపల్లి, జేపల్లి, గోకారం, చంద్రాయన్‌పల్లి, అప్పారెడ్డిపల్లి గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు భారీగా తరలివెళ్లారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

పెద్దకొత్తపల్లి: వానాకాలం రైతులు సాగు చేసిన వరిపంటను కోసి ధాన్యాన్ని రైతులు రోడ్లపై ఆరబెడుతున్నారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు బాలస్వామి, రాముడు, నర్సింహ కోరారు. మండలంలో వరిసాగు ఎక్కువగా చేసిన గ్రామాలు దేవల్‌తిరుమలాపురం, వెన్నచర్ల, నక్కలపల్లి, చంద్రకల్, ముష్టిపల్లి, పెద్దకార్పాముల, చిన్నకార్పాముల, సాతాపూర్, జొన్నలబొగుడ, కల్వకోలు, నారాయణపల్లి, గంట్రావుపల్లి గ్రామాల్లో వానాకాలం వరి సాగును 10,212 ఎకరాల్లో చేపట్టారు.

21న బహిరంగ సభ

బిజినేపల్లి: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బహిరంగ సభను బిజినేపల్లి మండల కేంద్రంలో ఈ నెల 21న మధ్యాహ్నం నిర్వహించనున్నారని, అందుకోసం సభ ఏర్పాట్లను ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి ఆదివారం మధ్యాహ్నం ప్రత్యేకంగా పరిశీలించారు. మంగళవారం బిజినేపల్లి మండల కేంద్రంలో నిర్వహించే ఈ సభలో స్టేజీ స్థలాన్ని, కళాకారుల నృత్య ప్రదర్శన వేదిక స్థలాన్ని, వివిధ గ్యాలరీల ఏర్పాట్లను ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సభకు దాదాపు లక్షకు పైగా జనం హాజరవుతారని, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. కాంగ్రెస్ నాయకులు కూచుకుళ్ల సుహాసన్‌రెడ్డి వెంకటస్వామి, తిరుపతయ్య, ఈశ్వర్, పర్వతాలు తదితరులు ఉన్నారు.

ఎల్లేనిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం

చిన్నంబావి: కొల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎల్లేని సుధాకర్‌రావును గెలిపించాలని మండలంలోని పెద్దదగడలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు కిరణ్‌కుమార్ మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి కావాలంటే బీజేపీతోనే సాధ్యం అవుతుందని అన్నారు. గత ఎన్నికల్లో ఓడిపోయిన నాటినుంచి ఎల్లేని సుధాకర్‌రావు ప్రజాసేవ చేస్తూ 5 సంవత్సరాలుగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని అన్నారు. ఆయన గెలుపు యువత భవిష్యత్‌కు అవసరమన్నారు. కరుణాకర్, ఉపేందర్, కురుమయ్య, వెంకటయ్య, శరత్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి



ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

కొల్లాపూర్: కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు ముందు ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆదిరాల అన్వేష్‌గౌడ్‌తో పాటు, కాంగ్రెస్ మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపీరు, మండలాల అధ్యక్షులు సయ్యద్, నిరంజన్, నజీర్, జాఫర్, పట్టణ అధ్యక్షుడు జహంగీర్‌తో పాటు పలువురు మైనార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిని కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి హర్షవర్ధన్‌రెడ్డి గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

కేసీఆర్ సభకు పోటెత్తిన జనం

కొల్లాపూర్ రూరల్/ పెంట్లవెల్లి: కొల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని ఏడు మండలాల్లోని ప్రతి గ్రామం నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, మహిళలు, కొల్లాపూర్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు తండోపతండాలుగా తరలివచ్చారు.

పెద్దకొత్తపల్లి: మండలంలోని సాతాపూర్, నక్కలపల్లి, ఆదిరాల, వెన్నచర్ల, కల్వకోలు, చెన్నపురావుపల్లి, పెద్దకొత్తపల్లి గ్రామాల నుంచి కొల్లాపూర్, ప్రజా ఆశీర్వాద సభకు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాన్‌గల్: కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభకు మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మి, వెంకటయ్య నాయుడు, వైస్ ఎంపీపీ కవితతో పాటు పార్టీ సర్పంచ్‌లు తరలివెళ్లారు.

చిన్నంబావి: కొల్లాపూర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజా ఆశీర్వాద సభకు మండలంలోని పలు గ్రామాల్లో బయలుదేరి వెళ్లారు. సీఎం కేసీఆర్ హాజరు అవుతుండటంతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కొల్లాపూర్‌కు ర్యాలీగా వెళ్లారు. సోమేశ్వరమ్మ, వెంకటరమణమ్మ, గోవింద్ శ్రీధర్‌రెడ్డి, మద్దిలేటి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

చాక్‌పీస్‌పై ప్రపంచ కప్



కల్వకుర్తి రూరల్: ప్రపంచకప్ క్రికెట్ పోటీలను దేశం ఆతిథ్యం ఇవ్వడానికి గుర్తుతో పాటుగా ప్రపంచకప్ ఫైనల్‌లో భారతదేశం చేరడానికి గుర్తుగా కల్వకుర్తి పట్టణానికి చెందిన యశ్వంత్ కుమార్(విద్యార్థి) 2 గంటలు కష్టపడి ప్రపంచకప్ నమూనాను చాక్‌పీస్‌పై తీర్చిదిద్దాడు. యశ్వంత్‌ను పలువురు అభినందించారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



తనిఖీలో భాగంగా బారులు తీరిన వాహనాలు

తాడూరు: మండలంలోని మేడిపూర్‌లో ఏర్పాటు చేసిన వాహనాల తనిఖీ కేంద్రం వద్ద అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఆకస్మికంగా సందర్శించి ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఆదేశించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆదివారం ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. దీంతో వాహనాల రద్దీ అధికమై రోడ్డు వెంట వాహనాలు బారులు తీరి ట్రాఫిక్ నిలిచిపోయింది. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీ చేస్తున్నామని అధికారి శ్రీనివాసులు తెలియజేశారు.

మైసమ్మ జాతరకు తగ్గిన భక్తులు



పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు ఈ ఆదివారం భక్తులు తక్కువ సంఖ్యలో హాజరై మైసమ్మ దేవతను దర్శించుకున్నారు. వివాహాలు, సీఎం కేసీఆర్ సభ కొల్లాపూర్‌లో ఉండటంతో చాలా మంది కొల్లాపూర్‌కు, వివాహాలకు తరలివెల్లడంతో 3 వేల మంది మాత్రమే భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

21 నుంచి రెండోవిడత శిక్షణ

- గైర్హాజరైతే చర్యలు తప్పవు
- కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్: జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి, జడ్చర్ల నియోజకవర్గాల పీఓలు, ఏపీఓలకు మాస్టర్ ట్రైనర్లతో రెండోవిడత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం శిక్షణ నోడల్ అధికారి నర్సింగరావు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి పత్యానాయక్, మాస్టర్ ట్రైనర్లతో చర్చించి షెడ్యూల్‌ను విడుదల చేసి మాట్లాడారు. ఈ నెల 21న కొల్లాపూర్ పీఓలకు జిల్లాకేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, ఏపీఓ (సహాయ ప్రిసైడింగ్ అధికారులు)లకు మధ్యాహ్నం రెండు నుంచి 5.30 వరకు, నాగర్‌కర్నూల్‌పీఓ (ప్రిసైడింగ్ అధికారులు)లకు శ్రీపురం రోడ్డులోని సైన్స్, ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 వరకు, 22వ తేదీన ఏపీఓలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. అదేరోజు అచ్చంపేట పీఓలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, ఏపీఓలకు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 5.30 వరకు, కల్వకుర్తి పీఓలకు 25వ తేదీన కల్వకుర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం రెండు వరకు, ఏపీఓలకు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 5.30 వరకు శిక్షణ తరగతులు జరగనున్నట్లు జరగనున్నట్లు వివరించారు. జడ్చర్ల నియోజకవర్గం ఊర్కొండ మండల పీఓలు, ఏపీఓలకు 21వ తేదీన జడ్చర్ల డా. బీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆయా నియోజకవర్గాల్లోని 826 పోలింగ్ కేంద్రాల్లో 3,964 మంది సిబ్బంది విధులు నిర్వర్తించనున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ఐదు గదులు, పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి ఐదు గదులు కేటాయించాలని సూచించారు. ఎన్నికల సిబ్బంది శిక్షణకు గైర్హాజరైతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ప్రమాదకరంగా బీటీ రోడ్డు

తాడూరు: మండల కేంద్రం నుంచి యాదిరెడ్డిపల్లి మీదుగా ఐతోలు, సిర్సవాడ వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు మండల ప్రభుత్వ కార్యాలయ సముదాయం వద్ద రోడ్డును ఇంటర్‌నెట్ కనెక్షన్ కోసం అడ్డంగా తవ్వి వదిలేశారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. రోడ్డు పక్కనే గుంత తీయడం, రోడ్డు మధ్య తవ్వడంతో వాహనాలు నడపాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కార్యాలయాల ఎదుటనే ఇలా ఏర్పడటం, ప్రతిరోజూ అధికారులు చూడటం తప్పా.. సంబంధిత అధికారులతో తాత్కాలిక మరమ్మతు నిర్వహించాలనే ఆలోచన రాకపోవడం విడ్డూరంగా ఉందని, ఇకనైనా అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

